సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధం

విపత్తులను ఎదుర్కొనేందుకైనా సంసిద్ధంగా ఉన్నామని నగర పాలక సంస్థ కమిషనర్, కడప ఆర్డీఓ తెలిపారు. -8లో..



వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ బలోపేతానికి అనుబంధ సంఘాల అధ్యక్షులంతా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.5/16.7

జిల్లాలో గురువారం 16.7 – 35.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

–కడప అగ్రికల్చర్

న్యాయం గెలవాలి.. నిజం తేలాలి

- అబద్ధాల రాతలపై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నిరసనలు
- ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల దహనం



కడప: ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో న్యాయం గెలవాలి...నిజం తేలాలని వైఎస్సార్‌సీపీ నేతలు నినదించారు. సీబీఐ దర్యాప్తు జరుగుతున్న విధానం, పచ్చ పత్రికల విషపురాతలపై ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో గురువారం నాయకుల్లో ఆగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్ జిల్లా కడప ఏడు రోడ్ల కూడలిలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం నాయకులు చేసి, ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై ఉద్దేశ్యపూర్వకంగా బురదజల్లుతూ కేసులో ఇరికించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. టీడీపీ చెప్పినట్లే సీబీఐ విచారణ సాగుతోందని, సీబీఐ అధికారిపై అందరిలోనూ అనుమానాలున్నాయన్నారు. తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వాలని వివేకా పీఏ కృష్ణారెడ్డి, కువైట్ గంగాధర్, ఉదయ్ కుమార్‌లను ఆయన బెదిరించారన్నారు. నిజాలను వెలికి తీయాల్సిన సీబీఐ అధికారులే ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని విచారణ చేయడం అన్యాయమన్నారు. వివేకా మరణవార్త విషయం వైఎస్ అవినాష్‌రెడ్డికి తెలిసింది ఆయన బావమరిది శివప్రకాష్‌రెడ్డి ద్వారానే అన్నారు. సునీల్ యాదవ్ అవినాష్‌రెడ్డి ఇంట్లో ఉన్నారని, హత్య విషయం ఆయనకు ముందే తెలుసునని విషపురాతలు రాయడం దారుణమన్నారు. వివేకా రాసినట్లుగా చెబుతున్న లేఖను సీబీఐ ఎందుకు దాస్తోందో చెప్పాలన్నారు. సీబీఐ కోర్టుకు సమర్పించిన కౌంటర్ బెయిల్ కాపీలు కోర్టుకు చేరకమునుపే పచ్చ పత్రికల్లో అచ్చు వేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు రాస్తున్న పచ్చ పత్రికలకు చరమగీతం పాడాలన్నారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి ప్రజలను నమ్మించాలి అనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఇప్పటికైనా సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరగాలన్నారు. కడిగిన ముత్యంలా వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ కేసు నుంచి బయటికి వస్తారన్నారు. సీబీఐ నిజానిజాలు తేల్చి న్యాయాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు ఎం. మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, షఫీ, నాయకులు బంగారు నాగయ్య, ఎస్. సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, తోటకృష్ణ, బండి ప్రసాద్, పస్తం అంజి, మునిశేఖర్ రెడ్డి, రహీమ్, అర్జున్, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, సునీత, నారాయణమ్మ, మల్లీశ్వరి, సుశీలమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా రాతలపై ఆగ్రహం

పులివెందుల : గురువారం వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయమై ఈనాడు, ఆంధ్ర జ్యోతి దిన పత్రికలలో వచ్చిన కథనాలపై పులివెందుల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో చంచల్ గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న సునీల్ యాదవ్ హైదరాబాద్ సీబీఐ కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్‌పై సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. దీనిపై గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఇతర నేతలపై ఎల్లో మీడియాలో అసత్య కథనాలు ప్రచురితమయ్యాయని స్థానిక పూలంగళ్ల సర్కిల్‌లో ఏబీఎన్ డౌన్ డౌన్, ఈనాడు డౌన్ డౌన్, రామోజీ డౌన్ డౌన్, రాధాకృష్ణ డౌన్ డౌన్, సీబీఐ విచారణపై అనుమానాలు అంటూ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ ఈనాడు, ఆంధ్ర జ్యోతి దినపత్రికలను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి, పుష్పనాథరెడ్డి, వేణుగోపాల్ యాదవ్, లింగాల మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, మండల నాయకులు అంబకపల్లె బాబురెడ్డి, సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, రామట్లపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, లోపట్నూతల నాగభూషణంరెడ్డి, వేముల మండల నాయకులు సాంబశివారెడ్డి, లింగాల రామలింగారెడ్డి, మరకా శివ కృష్ణారెడ్డి, తొండూరు మండల నాయకులు రవీంద్ర నాథరెడ్డి, పాలూరు వేణుగోపాల్‌రెడ్డి, రామమునిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఎల్లో మీడియా విషపు రాతల్ని నిరసిస్తూ గురువారం మైదుకూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి రాయుడు, ఖాదర్, షాషా, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నిందలు మోపితే సహించేది లేదు

పెనగలూరు: అన్నమయ్య జిల్లా పెనగలూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఈనాడు ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, మాజీ జెడ్పీటీసీ ఎర్రి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఈనాడు నిందలు మోపితే సహించేది లేదన్నారు. టీడీపీ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.

పుల్లంపేట: ఈనాడు ప్రతులను గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు కాల్చివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు, వైఎస్సార్‌సిపి నాయకులు బేకీ మణి, పార్థసారథిలు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఈనాడు నిందలు మోపితే సహించేది లేదన్నారు.

ఆ పత్రికలవి అసత్య కథనాలు

- వివేకా హత్యపై అబద్ధపు రాతలు రాయడం దుర్మార్గం
- ఎల్లో మీడియాపై ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

వల్లూరు: వైఎస్సార్‌సీపీ నేతల మనోభావాలను దెబ్బతీయడమే ధ్యేయంగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య సంఘటనపై ఎల్లో మీడియా అసత్య కథనాలను ప్రచురిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018 ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ కలిసి వివేకానందరెడ్డి పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించారని , అప్పటి టీడీపీ ప్రభుత్వం కుట్రలు పన్ని ఆయనను ఓటమి పాలు చేసిందని విమర్శించారు. 2014 ఎన్నికలతో బాటు 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి వివేకానందరెడ్డి కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా 2019 పార్లమెంటు ఎన్నికల్లో అవినాష్‌రెడ్డి విజయానికి పూర్తి స్థాయిలో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన చనిపోవడానికి ముందు రోజు కూడా పార్టీ విజయం కోసం కష్టపడ్డారని, ఈ విషయం అందరికీ తెలుసు నని అన్నారు. అలాంటిది కేవలం వారు కోరుకున్న వారికి లబ్ది చేకూర్చే క్రమంలో వైఎస్సార్‌సీపీని దెబ్బతీయడమే ప్రధాన ధ్యేయంగా ఎల్లో మీడియా అబద్ధపు రాతలు రాయడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

ఈనాడుకు గుణపాఠం తప్పదు

- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు: ప్రభుత్వంపై విషం చిమ్మేలా తప్పుడు సమాచారం ఇస్తున్న ఈనాడు పత్రికకు, దాని అధినేతకు ప్రజలచే గుణపాఠం తప్పదని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అసత్య కథనాలను ప్రచురించిన ఈనాడు ప్రతులను, రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పట్టాభి విషయంలో ప్రభుత్వంపై విషం చిమ్మేలా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పాత ఫొటోలు ప్రచురించడం సిగ్గుమాలిన చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు చట్టప్రకారం నడుచుకుని పట్టాభిని ఇబ్బంది పెట్టకపోయినా చంద్రబాబు ఆదేశాలతో అవాస్తవాలు వల్లించడం ఈనాడుకే చెల్లిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తుండటంతో ఇక జీవితంలో అధికారం దక్కదని భావించి రామోజీరావుతో కలిసి చంద్రబాబు ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్మే పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. రామోజీరావు, రాధాక్రిష్ణ ఎన్ని విషపు రాతలు రాసినా వైఎస్ జగన్‌పై ఉన్న ప్రజాభిమానాన్ని మార్చలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ఉపసర్పంచ్ తోట శివసాయి, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, మండల శివయ్య, బండారు మల్లికార్జున, జనార్దన్‌రాజు, రాఫ్, మల్లు క్రిష్ణారెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, శ్రీరామ్ వినోద్, తుమ్మల సురేష్ పాల్గొన్నారు.



పులివెందుల పూలంగళ్ల సర్కిల్ వద్ద ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతుల దహనం



పెనగలూరులో ఈనాడు ప్రతులను కాల్చివేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రైల్వేకోడూరు: రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విప్ కొరముట్ల తదితరులు

న్యూస్‌రీల్

ముగిసిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం

కడప సిటీ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. వైఎస్సార్ జిల్లాలో ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, స్వతంత్ర్య అభ్యర్థిగా ఎస్.రమణయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 24వ తేది నామినేషన్ పత్రాలను పరిశీలించనున్నారు. ఉపసంహరణకు ఈనెల 27వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి జేసీ సాయికాంత్‌వర్మ స్పష్టం చేశారు.

జిల్లాలో ప్రణాళిక బద్ధంగా భూముల రీ సర్వే



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ: భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే పనులను జిల్లాలో ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి రాష్ట్ర భూ పరిపాలన శాఖ కమిషనర్ సాయిప్రసాద్, సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కార్యాచరణ అమలుపై అన్ని జిల్లా కలెక్టర్లు, జేసీలతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ విజయరామరాజు,డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. వీసీ ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు రీ సర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణను పూర్తి చేయగలిగామన్నారు. భూ హక్కు పత్రాలను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ శాంతమ్మ, ల్యాండ్ సర్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆ నాలుగు అస్త్రాలతోనే బాబు రాజకీయం చేస్తున్నారు



ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను చదవొద్దని చెబుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

- ఎంపీ అవినాష్‌రెడ్డిపై విష ప్రచారం
- ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేసిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానంగా అబద్ధాలు చెప్పడం, వాటిని నిజం చేసుకోవడానికి ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను వాడుకోవడం, తన కులానికి రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి చేకూర్చడం, ఊసరవెల్లిలా రంగులు మార్చుతూ ఎన్నికల్లో పొత్తులు పెట్టుకోవడం అనే నాలుగు అస్త్రాలతోనే రాజకీయ పునాది వేసుకున్నాడని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని పుట్టపర్తి సర్కిల్‌లో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను ఎమ్మెల్యే దహనం చేశారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసత్యపు కథనాలను రాస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను ఎవరూ చదవొద్దని కోరారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు సీబీఐ కన్నా ముందే విచారణ చేస్తున్నాయన్నారు. దురుద్దేశంతో అవినాష్‌రెడ్డిపై విషపు రాతలు రాస్తున్నారని పేర్కొన్నారు. మరో గాంధీనో, వాల్మీకినో కొట్టినట్లు పట్టాభిని కొట్టారంటూ ఈనాడులో తాటికాయంత అక్షరాలతో అబద్ధాలు ప్రచురించారన్నారు. మళ్లీ ఈ కథనానికి సంబంధించి పాత ఫొటోలను వాడినట్లు ఈనాడు సవరణ ఇచ్చిందని తెలిపారు. రాజకీయ వార్తలకు సంబంధించి దురుద్దేశంతో రాసి సవరణ ఇస్తే సరిపోతుందా అని అన్నారు. ఈ కారణంగానే ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాయన్నారు. చంద్రబాబు ఊసరవెల్లి కన్నా ఎక్కువగా రంగులు మార్చుతూ ఎప్పటికప్పుడు ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నారన్నారు. సీఎం పదవిలో వాటా ఇస్తామని చెబితే జగన్‌తో కూడా పెత్తు పెట్టుకునేందుకు ఆయన సిద్ధమవుతాడన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలపై దుష్ప్రచారం

2024 ఎన్నికల్లో తమ పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు ఒక వ్యూహం ప్రకారం చంద్రబాబు అండ్ కో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. చంద్రబాబు పదవీ కాంక్షతో ఆక్రోశం, పగ వెళ్లగక్కుతూ మానసిక ఆందోళన చెందుతున్నారన్నారు. కాటికి కాలు చాపినా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయనకు పదవిపై వ్యామోహం చావలేదన్నారు. రెండెకరాలతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన చంద్రబాబుకు ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ బలం ప్రజా సేవేనన్నారు. ఆయన జెండా, అజెండా సేవేనని తెలిపారు. ఈ కారణంగానే ఆయన వ్యక్తిత్వం ప్రకాశింపబడుతోందని, చంద్రబాబు తీరు ఇందుకు భిన్నంగా ఉందన్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు రాజుపాళెం మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, సచివాలయాల కన్వీనర్ కాకర్ల నాగేశ్వారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యం

వాల్మీకిపురం: రక్తహీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యమని చైల్డ్ హెల్త్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నగరిమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫి, డాక్టర్ కీర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వచ్చే నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.ఎస్.మూర్తి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కుటుంబ తగాదాలు, వినియోగదారులు, ఐపీఆర్‌కు సంబంధించిన కేసులను మాత్రమే రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్: 08562–258622, 244622లను సంప్రదించాలని, ఈ మెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్స్.ఇకోర్ట్స్.జీవోవి.ఇన్/కడప. డిఎల్ఎస్ఏకెడిపిఅట్‌ది డేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌ను ఉపయోగించాలని వివరించారు.

స్పెషల్ డ్రైవ్‌లో 259 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసు అధికారులు వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో మొత్తం 259 కేసులను నమోదు చేశారు. వీటిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 229 కేసులు, సీటు బెల్ట్ ధరించని వారిపై 30 కేసులను నమోదు చేశారు.

రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వున్నట్లు ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు గురువారం తెలియజేశారు. ఈ వ్యక్తిని రిమ్స్‌కు తీసుకుని వచ్చిన సమయానికే మృతి చెంది వున్నాడని ఆయన తెలిపారు. ఎవరైనా బంధువులు వుంటే తమను సంప్రదించాలని వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ డీపీఎం రామకృష్ణరాజు

కడప అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం) రామకృష్ణరాజు తెలిపారు. కడపలోని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంచే విధానంపై రైతులకు తెలియజేయాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్

– 2 ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడం హర్షణీయం

రాజంపేట : రాష్ట్రంలో వడ్డెర్ల సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని వడ్డెర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, వడ్డెర్ల ఉద్యోగుల సంఘం గౌరవ సలహాదారుడు కేవీ రమణ అన్నారు. రాజంపేటలోని తన కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను వడ్డెర్లకు కేటాయించడం అభినందనీయమన్నారు. వడ్డెర కులస్తులు అయిన గుంటూరు జిల్లాకు చెందిన చంద్రగిరి యేసురత్నం, ఏలూరు జిల్లాకు చెందిన జయమంగళ వెంకటరమణ ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది వడ్డెరలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

- ఎస్‌డీఆర్‌ఎఫ్ పర్యవేక్షణలో మాక్ డ్రిల్
- కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకైనా సంసిద్ధంగా ఉన్నామని నగర పాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. సీడీఆర్ఎస్ మాక్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నగర శివారులోని ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బాటలింగ్ ప్లాంటు ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ బీవీఎస్ రాంప్రకాశ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఐఓసీఎల్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షించారు. ట్యాంకర్లకు గ్యాస్ ఫిల్లింగ్ సమయంలో మంటలు వ్యాపించిన తీరు.. ప్రమాద పరిస్థితులను ఎస్‌డీఆర్‌ఎఫ్, జిల్లా ఫైర్ సేఫ్టీ సిబ్బంది, రెస్క్యూ టీం బలగాలు చేధించడాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. జిల్లాలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ (ఫ్యాక్టరీస్) కృష్ణమూర్తి, ఏఎస్పీ కృష్ణారెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, ఐఓసీఎల్ డీజీఎం ధర్మారావు, డీఎంహెచ్ఓ నాగరాజు, ఏడీఎఫ్ఓ బసిరెడ్డి, ఏపీఎస్ పీడీసీఎల్ డీఈఈ నాగమునిస్వామి, రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి, డీటీసీ మీరా ప్రసాద్, ఎంవీఐ శివప్రసాద్, తహసీల్దార్ శివరామిరెడ్డి, పర్యావరణశాఖ అధికారి జావేద్, ఐపీఓ శైలజ, సమాచార పౌర సంబంధాల అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న అనుబంధ సంఘాల అధ్యక్షులు

కడప కార్పొరేషన్ : జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అనుబంధ సంఘాల అధ్యక్షులంతా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక అపూర్వ కల్యాణ మండపంలో వారు సురేష్ బాబును కలిసి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా అనుబంధ విభాగాల్లో నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, అనుబంధ సంఘాల అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, సీహెచ్ వినోద్, జాషువా, షఫీ, చైతన్య, బంగారు నాగయ్య, సాయిదత్త, శివానాయక్, బండి ప్రసాద్, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌వీ రమణ, షఫీవుల్లా, మధు, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మోటార్ సైకిల్‌ను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మరియాపురానికి చెందిన ప్రభాకర్ పనిపై వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆ దారిన వెళుతూ సంఘటనను చూశారు. సమీపంలోని మెడికల్ స్టోర్ వద్ద మందులు తీసుకుని వెంటనే ప్రథమ చికిత్స చేశారు. తరువాత వైద్య పరీక్షల కోసం రిమ్స్‌కు పంపించారు.

యువకుడి అదృశ్యంపై గాలింపు చర్యలు



గండికోట వెనుక జలాల్లో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

కొండాపురం : ఓ యువకుడి అదృశ్యంపై కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ అనే యువకుడు ఈ నెల 7వ తేదీ నుంచి కనిపించలేదని తండ్రి గంగాధర్ ఈ నెల 20న కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ యువకుడికి సంబంధించిన వస్తువులు గండికోట జలాశయం వెనుకజలాల సమీపంలో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు గురువారం సమాచారం ఇచ్చారు. అనుమానం ఉన్న చోట్ల క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెనుక జలాల్లో గజ ఈతగాళ్ల సాయంతో సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం కూడా గాలింపు చర్యలు చేపడుతామని ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మైదుకూరు : మండలంలోని తవ్వపల్లె సమీపంలో బుధవారం రాత్రి ఎంపర్ల వెంకట సుమన్ (24) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని ఉప్పుగుంటపల్లెకు చెందిన వెంకటసుమన్ జీవీ సత్రంలోని ఓ ఎరువుల దుకాణంలో పని చేస్తుండే వాడు. బుధవారం రాత్రి దుకాణం నుంచి ఇంటికి వచ్చిన అతను 8 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. తవ్వపల్లె సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. గురువారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన వారు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మైదుకూరు అర్బన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం తరలించారు. వెంకట సుమన్‌కు ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. యువకుని తండ్రి వెంకట సుబ్బయ్య ఫిర్యాదు మేరకు అర్బన్ ఏఎస్ఐ చంద్రమౌళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పోరుమామిళ్ల : మండలంలోని దమ్మన్నపల్లెకు చెందిన కమలాపురం సుమలత(28) గురువారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్ బోర్డు నుంచి సెల్ చార్జర్ తీస్తుండగా, బోర్డు నుంచి వేలాడుతున్న తీగ ఆమెకు తగిలింది. విద్యుత్ ప్రసారమై అస్వస్థతకు గురైంది. ఆమెను భర్త రమేష్ పోరుమామిళ్ల ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుమలతకు ఇద్దరు పిల్లలు. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నాడు-నేడు స్ఫూర్తితో
సబ్‌స్టేషన్ సుందరీకరణ



సుందరీకరించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

వీరబల్లి : మండల పరిధి గడికోట గ్రామంలో నాడు–నేడు స్ఫూర్తితో విద్యుత్ సబ్‌స్టేషన్ సుందరీకరణ పనులు చేపట్టినట్లు విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. సుందరీకరించిన సబ్‌స్టేషన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పనులు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాలివీటి విజయ్ భాస్కర్‌రెడ్డి, గాలివీటి మురళీ మోహన్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యువనాయకుడు గాలివీటి మదన్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామస్వామి సన్నిధిలో..

ఒంటిమిట్ట(సిద్దవటం): ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ చైర్మన్, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్, సిబ్బంది, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ మునిశంకరయ్య, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ ఉదయ్‌కుమార్, సిబ్బంది, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూరిన యువకుడికి దేహశుద్ధి

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌస్‌నగర్‌లో ఓ ఇంట్లోకి చొరబడిన యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. గురువారం రాత్రి సదరు యువకుడు మద్యం సేవించి నేరుగా ఇంట్లోకి వెళ్లి కూర్చుని వికృతచేష్టలకు పాల్పడ్డాడు. ఇంటిలోని మహిళలు భయపడి చుట్టుపక్కల వారిని పిలిచారు. అందరూ కలిసి అతనికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులను సంఘటనా స్థలానికి పిలిపించారు. యువకుడిని కడప టూటౌన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తనది రేణిగుంట అని అతడు తెలిపాడు. జులాయిగా తిరుగుతున్నట్లు సమాచారం. అతన్ని పోలీసులు స్వగ్రామానికి రైలులో పంపించారు.

అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి

గౌస్‌నగర్, గంజికుంట కాలనీలో ఇటీవల కాలంలో రాత్రి వేళలో యువకుల సంచారం ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు. అలాగే రాష్ డ్రైవింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అసలే ఇరుకు వీధులు.. ఆపై చిన్న పిల్లలు ఎక్కువగా ఉండే వీధుల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గంజికుంట కాలనీలోని కట్టపై రాత్రి వేళల్లో యువకుల ఆగడాలు ఎక్కువయ్యాయని.. పోలీసులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

చౌక బియ్యం సీజ్

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు రోడ్డు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో 148 చౌక దుకాణం బియ్యం (7012 కేజీలు) సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు రెడ్డప్ప, రామకృష్ణ తెలిపారు. గాలివీడు బస్టాండ్ పెద్దూరు మధ్యలో రేషన్ బియ్యం నిల్వ ఉన్న సమాచారం అందుకున్న వారు స్థానిక తహసీల్దార్ దైవాదీనం, డీటీ తిమ్మారెడ్డితో కలిసి దాడి చేశారు. 148 బస్తాల బియ్యాన్ని పెద్దూరులోని ఎఫ్‌పీ షాప్‌కి తరలించి క్రిమినల్ కేసు నమోదు చేశారు.